క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలసిన నాయకులు



సీఎం జగన్‌ను కలసిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, మురళీ



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన జెడ్పీటీసీ పద్మావతి, అప్పాజీ దంపతులు

పెదపూడి: అమరావతిలోని అసెంబ్లీ హాలు వద్ద బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పెదపూడి మండల యువజన విభాగం అధ్యక్షుడు గుడిమెట్ల మురళీకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

జెడ్పీటీసీ దంపతులు..

బిక్కవోలు: జెడ్పీటీసీ రొంగల పద్మావతి, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్‌ రొంగల అప్పాజీ దంపతులు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలో ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారు కలిశారు.

ముగిసిన రైతు శిక్షణ కార్యక్రమం



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

రంగంపేట: వడిశలేరులో రైతులకు పంటల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిస్తాయి. రెండు రోజు పాటు శిక్షణలో భాగంగా విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పలు అంశాలు వివరించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు దక్షిణామూర్తి, వీరబాబు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్లు ఎం.నందకిశోర్, సీపీ నరసింహారావు మాట్లాడుతూ వరిని ఆశించే ప్రధాన కీటకాలు వాటి యాజమాన్యం గురించి వివరించారు. వరిలో వచ్చే ఎండాకు తెగులను ఎలా గుర్తించాలి, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌ పోతుల బులివీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గోకవరం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–2లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు డాక్టర్‌ ఆలేఖ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ రాజేశ్వరి, ఎంపీహెచ్‌ఈఓ శంకర్, అనూష, పవన్, నాగలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురికి జరిమానా

పెదపూడి: దాడి కేసులో ఐదుగురికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని పెదపూడి ఎస్సై పి.వాసు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శహపురంలో 2019 జనవరి 15న వి.రమణపై పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన గుబ్బల నూకరాజు, జి.శ్రీనివాసు, జి.వెంకట, జి.ఉమామహేశ్వరరావు, జి.రాంబాబులు ఇటుకలు, ఇనుపరాడ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుపై అప్పటి ఎస్సై వి.సురేష్‌ కేసు నమోదు చేశారు. ఈ మేరకు జరిగిన వాదోపవాదాల్లో ఆ ఐదుగురికి పైవిధంగా జరిమానా విధించారు.

దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండల పరిధిలో కాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్‌ సీడీపీఓ జె.ఝాన్సీరాణి బుధవారం తెలిపారు. గోకవరంలోని గుమ్మళ్లదొడ్డి–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు (బీసీ–ఈ) ఖాళీగా ఉందన్నారు. స్థానిక వివాహితులై పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం

రంగంపేట: దొంతమూరులో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దొంతమూరుకు చెందిన జట్టు శివ 15 సారా కలిగి ఉండడంతో అరెస్టు చేశామన్నారు. అలాగే బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

కోడిపందేలపై దాడి

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామ శివారులో జరుగుతున్న కోడిపందేలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,700, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్సై కట్టా శారదా సతీష్, పోలీసులు పాల్గొన్నారు.

జై గణేశ.. శ్రీ గణేశ

- వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు
- ఊరంతా వేడుకలతో సందడి

అనపర్తి: జైగణేశ.. శ్రీగణేశా అంటూ ఆ స్వామివారిని భక్తులు మనసారా కొలిచారు.. గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా ఉత్సవ మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. ఊరూవాడా సంబరం నెలకొంది. అనపర్తి కెనాల్‌ రోడ్డు పెట్రోల్‌ బంకు సమీపంలో గణపతి ఆలయం వద్ద సుమారు 8 వేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమాన్ని ఎన్‌సీఆర్‌ మురళీ, భాస్కరరెడ్డి, మునీశ్వరరెడ్డి, బాబుల్‌రెడ్డి, జెమ్మి, ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. రెల్లిపేటలో గణేశ మండపం వద్ద అన్నసమారాధన జరిగింది. ఇదిలా ఉండగా గ్రామంలోని ఆయా మండపాల్లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి ఊరేగించారు. అనంతరం స్థానిక ఎర్రకాలువ, పాతవూరు నల్లకాలువ వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

బిక్కవోలు: స్థానిక పెద్ద కాలువ, కొమరిపాలెం, తోస్సిపూడి, పందలపాక, కొంకుదురు గ్రామాల్లో తుల్యభాగ నదిలో గణేశ విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఎస్సై పి.బుజ్జిబాబు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేకంగా క్రేన్‌లు ఏర్పాటు చేయగా వాటి సహాయంతో విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు. కొంకుదురు వెలంపేటలో కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద 9 కిలోల లడ్డూను అదే గ్రామానికి చెందిన సప్పా సత్యనారాయణ వేలంలో రూ.15,559కు దక్కించుకున్నారు. తూర్పుపేట రామాలయం వద్ద శ్రీబాల గణపతి ఆలయంలో తొమ్మిది కిలోల లడ్డూను అల్లి దుర్గాప్రసాద్‌ రూ.13,500కు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి విగ్రహాలు నిమజ్జనం చేశారు.

విగ్రహాల ఊరేగింపు

పెదపూడి: వినాయక చవితి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం గణనాథుని విగ్రహ నిమజ్జనోత్సవాలను భక్తులు చేపట్టారు. జి.మామిడాడలో బోడావారి వీధి, గ్రామ శివారు ఎల్‌ఎస్‌పురం, సంపర, పెదపూడిలో బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహం వద్ద నెలకొల్పిన సిద్ధి వినాయకుడు, దోమాడ, కరకుదురు, రామేశ్వరంలో రుద్రాక్ష వినాయకుడి మండపం వద్ద, ఏపీత్రయం తదితర గ్రామాల్లోని మెయిన్‌రోడ్డులో గణనాథులను ఘనంగా ఊరేగించారు. యువకుల నృత్యాలు, డప్పులు వాయిద్యాలు, మేళాతాలతో, పెద్దఎత్తున బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సమీప పెద్ద కాలువల్లో నిమజ్జనం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధలు జరిపారు.



పందలపాకలో గణనాథుని విగ్రహ నిమజ్జనం



అనపర్తి పెట్రోల్‌ బంకు వినాయకుని ఆలయం వద్ద అన్నసమారాధన



కొంకుదురులో వేలంలో దక్కించుకున్న లడ్డూతో సప్పా సత్యనారాయణ

సూర్యదేవుని హుండీ ఆదాయం రూ.2.44 లక్షలు



జి.మామిడాడలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న ప్రతినిధులు, పర్యవేక్షిస్తున్న అధికారులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయం రూ.2,44,694 వచ్చిందని ఆలయ ఈఓ మోర్తా మురళీ వీరభద్రరావు బుధవారం తెలిపారు. ఈ లెక్కింపు దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.రాజేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిందన్నారు. గత ఫిబ్రవరి 25 నుంచి నేటి వరకూ హుండీ ఆదాయం లెక్కించారన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, వెంకటరెడ్డి, మధుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు ఎంపిక



బిక్కవోలులో క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రభాకర్‌

బిక్కవోలు: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల చెందిన ఆరుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పళ్లా వీరప్రభాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సబ్‌ జూనియర్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ బాలుర విభాగంలో విసినగిరి హేమంత్‌ దుర్గ, తులసి రామ్‌చరణ్, బొడ్డు వెంకటవినయ్, బాలికల విభాగంలో బూడి ప్రసన్నభార్గవి, బండారు చాందిని శ్రియ, దుళ్ల అలేఖ్య ఎంపికయ్యారు. వీరు ఈ నెల 30 నుంచి అక్టోబర్‌ 2 వరకూ కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో తూర్పుగోదావరి జిల్లా తరఫున ఆడతారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ మానుకుండ ధనరాజ్‌రెడ్డి, నరేంద్రలను అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.45 లక్షలు

బిక్కవోలు: కొంకుదురులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్‌ సత్తి వీరమణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని సత్తి వెంకటరాయుడు ఇంటి నుంచి బ్రిడ్జి వరకూ పంచాయతీరాజ్‌ శాఖ రూ.45 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులు వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి, శాసన సభ స్పీకర్‌ ప్రత్యేక అధికారి పడాల సత్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా పాల్గొన్నారు.

వినాయకుని లడ్డూలకు వేలం



వినాయక లడ్డూను వేలంలో సొంతం చేసుకున్న శివతో ఆలయ కమిటీ సభ్యులు

రాజానగరం: పలుచోట్ల మండపాలలో కొలువుతీరిన గణేషుని చేతిలో ఉంచిన లడ్డూలను వేలం వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో వినాయక లడ్డూకు వేలం నిర్వహించారు. వేలుమూరి శివ రూ.30 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గత ఏడాది రూ.14,500కు వేలం వెళ్లగా, ఈ సారి రూ.15,500 అధికంగా పలికిందని నిర్వాహకులు తెలిపారు. దివాన్‌ చెరువులోని బీజాపూరీ కాలనీలో తొలిసారిగా ఏర్పాటు చేసిన గణేషుని మండపంలోని లడ్డూ ధర వేలంలో రూ. 13 వేలు పలికింది.

సుందరంగా రూపుదిద్దుకుని..

- అనపర్తిలో పూర్తయిన షాపింగ్‌ కాంప్లెక్స్‌
- నేడు ప్రజాప్రతినిధులచే ప్రారంభం

అనపర్తి: జనాభా పరంగా అనపర్తి విస్తరిస్తోంది.. జనావాసాలూ గణనీయంగా పెరిగాయి. వీరి అవసరాలకు అనుగుణంగా వ్యాపారాలు అధికమవుతున్నాయి. ఇందులో వ్యాపారులకు గూడు కల్పించే ఉద్దేశంతో సర్వాంగ సుందరంగా షాపింగ్‌ కాంప్లెక్స్‌ రూపుదిద్దుకుంది. అనపర్తి గ్రామ పంచాయతీ మార్కెట్‌ ఏరియాలో కొత్తగా నిర్మించిన నాలుగు దుకాణ సముదాయాల ప్రారంభోత్సవం గురువారం జరుగనుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మార్కెట్‌ ఏరియాలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్, వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి, జ్యోతీరావ్‌పూలే, బాబూ జగ్జీవన్‌రామ్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ల పేరుతో ఒక్కొక్క కాంప్లెక్స్‌లో 8 చొప్పున మొత్తం 32 షాపులు నిర్మించారు. గురువారం నిర్వహించే ప్రారంభోత్సవంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని దుకాణ సముదాయాలను ప్రారంభించనున్నారు.



అనపర్తిలో కొత్తగా నిర్మించిన దుకాణ సముదాయాలు

నాడు వదిలేశారు.. నేడు తీర్చిదిద్దారు

2010లో టీడీపీ హయాంలో అప్పటి పంచాయతీ పాలకమండలి షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణాన్ని చేపట్టింది. ఆ సమయంలో చోటుచేసుకున్న వివిధ సమస్యల కారణంగా వీటి నిర్మాణం నిలిచిపోయింది. తదనంతరం పంచాయతీ ప్రత్యేక అధికారి పాలనలో సైతం షాపింగ్‌ కాంప్లెక్స్‌ పనులపై దృష్టి సారించకపోవడంతో పుష్కరకాలంగా మొండి గోడలే దర్శనమిచ్చాయి. రోజురోజుకూ పెరుగుతున్న వ్యాపార అవసరాలు, వాటికి అనుగుణంగా షాపులు లేకపోవడంతో వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి వ్యాపార సముదాయాల అభివృద్ధి పనులకు చొరవ చూపారు. దీంతో 80 శాతం పంచాయతీ సాధారణ నిధులు, 20 శాతం 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం సుమారు రూ. 58 లక్షలతో ఈ దుకాణ సముదాయాల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. నాలుగు దుకాణ సముదాయాల్లో 32 షాపులకు గాను ప్రభుత్వ నిబంధనల మేరకు షెడ్యూల్డ్‌ కులాల వారికి 15 శాతం లాటరీ పద్ధతిలో కేటాయించారు. దీని ద్వారా షెడ్యూల్డ్‌ కులాల వారికి కేటాయించిన 5 షాపులతో పాటు ఓపెన్‌ కేటగిరీలో 27 షాపులు మొత్తం 32 షాపులకు బహిరంగ వేలం నిర్వహించి షాపుల కేటాయింపు పూర్తి చేశారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్‌ కోరుతూ వినతి

అనపర్తి/ బిక్కవోలు: అనపర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ రైలుకు హాల్ట్‌ ఇచ్చేలా కృషి చేయాలని గోదావరి రెడ్డి కల్చరల్‌ అసోసియేషన్‌ ప్రతినిధుల బృందం బుధవారం బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్‌ నరసింహారావును కలసి వినతి పత్రం అందించారు. తూర్పు, కోనసీమ జిల్లాల్లోని అనపర్తి, బిక్కవోలు, రాయవరం, మండపేట, రామచంద్రపురం, పెదపూడి మండలాల పరిధిలో సుమారు 100 గ్రామాలకు చెందిన కుటుంబాలు వృత్తి, వ్యాపారాల రీత్యా విశాఖతో పాటు పరిసర జిల్లాల్లో నివసిస్తున్నట్లు వారు తెలిపారు. తమ సొంత గ్రామాలను చేరుకునేందుకు అనపర్తి రైల్వే స్టేషన్‌ ద్వారానే రాకపోకలు సాగిస్తారని తెలిపారు. అయితే అనపర్తి నుంచి వైజాగ్‌ వెళ్లేందుకు మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధరాత్రి 11.30 వరకూ రైలు సదుపాయం లేదని, దీంతో ఆయా సమయాల్లో విశాఖ చేరేందుకు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని పేర్కొన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ రైలుకు అనపర్తి రైల్వే స్టేషన్‌లో హాల్టు కల్పించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ నరసింహారావు రైల్వే ఉన్నతాధికారులను ఫోన్లో సంప్రదించగా జన్మభూమి హాల్టుపై వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్‌ ప్రతినిధులు తెలిపారు. గోదావరి రెడ్డి కల్చరల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పీవీవీ సూర్రెడ్డి, విశాఖ బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి, అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు పులగం సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి సత్తి వీర్రాఘవరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఒగిరెడ్డి వెంకటరెడ్డి, తాడి శివారెడ్డి, తాడి చినబాబుతదితరులు ఎంపీని కలసిన వారిలో ఉన్నారు.



ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోదావరి రెడ్డి కల్చరల్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

రాజానగరం: వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కలిగిస్తూ లాలా చెరువు ఫారెస్టు అకాడమీలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ బుధవారం ముగిసింది. పెట్రోలింగ్‌ ద్వారా వన్యప్రాణుల నేరస్తులను గుర్తించడంలో వివిధ క్షేత్ర సాంకేతికతలు, వన్యప్రాణుల రక్షణ చట్టం వంటి పలు అంశాలపై ఫారెస్టు అధికారులు, ఫారెస్టు రేంజ్‌ అధికారులు, ఫారెస్టు బీట్‌ అధికారులు, అకాడమీ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని రాజమహేంద్రవరం సర్కిల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్టు అధికారి ఎస్‌.శరవణన్‌ తెలిపారు. డబ్ల్యూసీఎస్‌ – ఇండియా సిబ్బంది ప్రోగ్రామ్‌ హెడ్‌ ఇమ్రాన్‌ సిద్దిఖీ, న్యాయవాది పాల్‌ బెంజిమిన్, గుజ్జా హర్షవర్ధన్, శ్రీధర్‌ దూపాడులు వన్యప్రాణాలు సంరక్షణ గురించి ప్రసంగించారు. చట్టపరమైన నిబంధనలతోపాటు ఫోరెన్సిక్‌ మెటీరియల్‌ సేకరణ కోసం ఫీల్డ్‌ మెథడ్స్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ 24 వైల్డ్‌ లైఫ్‌ ఫోరెన్సిక్‌ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్‌ పి.ఉదయ్‌ భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

నేడు వెదుళ్లపల్లిలో వైద్య శిబిరం

రాజానగరం: రాజానగరాన్ని సంపూర్ణ ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పంలో భాగంగా సీతానగరం మండలం వెదుళ్లపల్లిలో గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుంది. డెల్టా ఆస్పత్రి సహకారంతో జనరల్‌ మెడిసిన్, జనరల్‌ సర్జరీ, గుండె, స్త్రీలు, చిన్నపిల్లల వైద్యం, చర్మ, మూత్రకోశ, నరాలు, కిడ్నీ, చెవి, ముక్కు, గొంతు, ఛాతీ, ఊపిరితిత్తులు, కీళ్ల, ఎముకలు, కంటి, దంత వైద్యానికి సంబంధించి సేవలు అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైతే అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేస్తారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

రాజానగరం: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని నరేంద్రపురం, చక్రద్వారబంధం అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. రాజానగరం ఐసీడీఎస్‌ సీడీపీఓ టి.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహారం ఆవశ్యకత, తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే విధానం, ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ టి.మునలయ్య, ఉప సర్పంచ్‌ జి.రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు టి.చిలకమ్మ, వైఎస్సార్‌ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్‌ వీర్రాఘవులు, ఆర్‌బీకే చైర్మన్‌ ప్రగడ రాంబాబు, నాయకులు పంపన శ్రీను, ప్రగడ శివ, నాగవరపు త్రిమూర్తులు, ఉప్పులూరి రమేష్, రమణ, శివరామకృష్ణ, సూపర్‌వైజర్‌ ఎన్‌కే దుర్గామణి పాల్గొన్నారు.



చక్రద్వారబంధంలో సామూహిక సీమంతం

అంగన్‌వాడీ హెల్పర్‌ ఉద్యోగాలకు దరఖాస్తులు

మధురపూడి: కోరుకొండ పరిధిలో అంగన్‌వాడీ సహాయకురాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కోరుకొండ మండలం గాదరాడ 2, కోటి 2, 3, పశ్చిమగానుగూడెం 2 సెంటర్లలో, అలాగే సీతానగరం మండలం కాటవరం 1, గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి 1 సెంటర్‌లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలవారు అక్టోబర్‌ నాలుగో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి అక్టోబర్‌ ఆరున సబ్‌ కలెక్టర్‌ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలో పాలచర్ల 2, తోకాడ 3 అంగన్‌వాడీ కేంద్రాలలో రెండు కార్యకర్తల పోస్టులు, వెంకటనగరం2లో ఒక సహాయకురాలి పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే రాజమహేంద్రవరం రూరల్‌ మండలం పిడింగొయ్యి 3, 7లలో రెండు సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హత, ఆసక్తి ఉన్న వారు అక్టోబరు 4లోగా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి తెలిపారు.

సేవల్లో సెర్వ్‌విత్‌ హార్ట్‌

బిక్కవోలు: సెర్వ్‌విత్‌ హార్ట్‌ సంస్థ నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బలభద్రపురంలో వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా వలస కూలీలకు దోమతెరలు, చాపలు, దుప్పట్లు, పాదరక్షలు, చార్జింగ్‌ లైట్లు, పిల్లలకు బొమ్మలు, స్వీట్లు పంపిణీ చేశారు. సుమారు 80 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సర్వీస్‌ హార్ట్‌ వ్యవస్థాపకుడు వేమగిరి ప్రశాంత్‌కుమార్‌ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్య అతిథి జడ్సన్‌ మోజెస్, సభ్యులు హుస్సేన్‌ రబ్బాని, లంక శ్రీనివాస్, ఎస్‌ఎస్‌ఎన్‌ ఫణి, ఎం.రవీంద్ర, రామశర్మ, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్లకు ఆదర్శంగా నిలవాలి



డ్యాన్స్‌ చేస్తున్న పారామెడికల్‌ విద్యార్థులు

రాజానగరం: జూనియర్లకు సీనియర్లు ఆదర్శంగా నిలిచి, వారి ఉన్నతికి మార్గదర్శకులు కావాలని జీఎస్‌ఎల్‌ విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ గన్ని భాస్కరరావు అన్నారు. పారా మెడికల్‌ కాలేజీలో 5వ బ్యాచ్‌ విద్యార్థులతో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఫ్రెషర్స్‌ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాలలోని ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పారామెడికల్‌ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ టి.సత్య ప్రకాష్‌ పాల్గొన్నారు.

మౌనికకు పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఎవల్యూషన్‌ ఆఫ్‌ హైబ్రిడ్‌ ఎక్స్‌ప్టమ్‌ లెర్నింగ్‌ మిషన్‌ మోడల్స్‌ ఫర్‌ ఇంట్రూషన్‌ డిటెక్షన్‌ సిస్టమ్‌ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను కొండ్రు మౌనికకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్‌డీని ప్రదానం చేశారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆమె ఈ పరిశోధన చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని కాకినాడ జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–19 కార్యదర్శి కె.శివరామకృష్ణ తెలిపారు. జి.మామిడాడ ఫ్యామిలీ హెల్త్‌ క్లబ్‌ ఆవరణలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) అండర్‌–19 క్రీడా జట్ల ఎంపికలు ప్రారంభమయ్యాయి. దీనికి కె.శివరామకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఫ్యామిలీ హెల్త్‌ క్లబ్‌ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, డీఐఈఓ జి.నూకరాజు హాజరయ్యారు. శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అండర్‌–19 స్కూల్‌ గేమ్స్‌కు 30 ఏళ్లుగా విశేష సేవలు అందించిన వై.తాతాబ్బాయిని ఘనంగా సత్కరించారు. అండర్‌–19 విభాగ వాలీబాల్, టేబుల్‌ టెన్నిస్, షటిల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడల్లో సుమారు 300 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ క్రీడా ఎంపికల ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పడాల గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుగా ఎంపిక చేశామన్నారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు భోజన వసతిని స్థానిక లయన్స్‌క్లబ్‌ ఆఫ్‌ శ్రీసూర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఫ్యామిలీ హెల్త్‌ క్లబ్‌ కార్యదర్శి ద్వారంపూడి బ్రహ్మానందరెడ్డి, సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, లయన్స్‌ క్లబ్‌ కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి, ప్రతినిధులు మండ రాజారెడ్డి, ఛత్రపతి శివాజీ, రావడ నాగు, వి.సతీష్‌ పాల్గొన్నారు.



జి.మామిడాడలో ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్‌ పోటీలు

ఎలుకలను సామూహికంగా నివారించాలి

పెదపూడి: ఎలుకలను రైతులు సామూహికంగా నివారించాలని మండల వ్యవసాయాధికారి టీవీఆర్‌ మణిదీప్‌ సూచించారు. పెదపూడి మండలంలో 18 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎలుకల నివారణ మందును బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తొలకరిలో నారుమడుల దశ నుంచే ఎలుకల వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎలుకకు పుట్టకతోనే ఆరు దంతాలు ఉంటాయన్నారు. ఏడాదిలో ఒక జత ఎలుకలు 1,200 ఎలుకలను కంటాయన్నారు. రోజుకు వాటి పళ్లు మిల్లీ మీటర్‌లో 5వ వంతు పెరుగుతాయన్నారు. ఈ దంతాలు అరగదీయడానికి అవి పంటలను కొరిచి పాడుచేస్తాయన్నారు. తనకు కావాల్సిన దానికంటే పదిరెట్లు ఎక్కువ ఆహారాన్ని పాడు చేస్తుందన్నారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం ఉచితంగా బ్రోమోడయోలిన్‌ మందును సరఫరా చేస్తుందన్నారు. పెదపూడి మండలానికి 81 కిలోల మందు వచ్చిందన్నారు. కరకుదురు, దోమాడ సర్పంచులు నూని పట్టాభిరామన్న చౌదరి, మీనవల్లి శారదదేవి, వ్యవసాయశాఖ విస్తరణ అధికారి సత్యనారాయణ, వీఏఏ దేవగుప్తాపు శ్రీను, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



దోమాడలో ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఏఓ మణిదీప్‌